సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



కొండను కొల్లగొట్టారు..

జంబాడ కొండను గుల్ల చేశారు. మూడు రోజులుగా కంకరను తీసుకెళ్తూనే ఉన్నారు.

- 8లో



నందివాడ ఆశ్రమంలో చోరీ

నందివాడ ఆశ్రమంలో చోరీ జరిగింది. రూ.8 లక్షల విలువైన వస్తువులు పోయాయి.

- 8లో

నవోదయ దరఖాస్తుల గడువు పెంపు

నరుబుజ్జిలి: 2025–26 విద్యా సంవత్సరంలో వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం ఈ నెల 23 వరకు దరఖాస్తు గడువు పెంచినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. జవహర్ నవోదయ విద్యాలయ సమితి కల్పించిన ఈ సదవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వెల్లడించారు.

న్యూస్‌రీల్

ప్రథమ స్థానమే లక్ష్యం: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అభివృద్ధికి అవకాశం ఉన్న అన్ని రంగాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కీలక శాఖల 100 రోజుల కార్యాచరణ నివేదికలపై శాఖల వారీ ఉన్నతాధికారులతో బుధవారం నుంచి సమీక్షలు నిర్వహించి దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో 100 రోజుల పనుల ప్రగతి, లక్ష్యాలపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి మండలాధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ నెలాఖరులోగా ఫ్రీ హోల్డ్ భూముల రికార్డుల పరిశీలన కార్యక్రమం పూర్తి చేయాలని, పరిశీలన పూర్తయ్యాక లోటు పాట్లు ఏమైనా ఉంటే ప్రభుత్వ నిర్ణయం మేరకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఉపాధి హామీ పనుల లేబర్ బడ్జెట్, ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఈ పంట నమోదు, తదితర అంశాలలో నిర్దేశించిన ప్రగతి లక్ష్య సాధనలో కొంతమంది మండల క్షేత్ర స్థాయి అధికారులు తక్కువ ప్రగతి సాధిస్తున్నారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణాల్లో ఇకపై జాప్యం ఉండకూడదన్నారు. రోడ్డు మీద చెత్త కనిపిస్తే ఆ పంచాయతీ సెక్రటరీపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఓటర్ల జాబితా రూపొందించడంలో అలసత్వం పనికిరాదని, ఈనెల 20వ తేదీ లోపు ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో ఫిర్యాదుల బాక్స్ లు ప్రత్యేకించి విద్యార్థినుల కోసం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామాల అవసరాలకు అనుగుణంగా గుర్తించిన ప్రగతి పనులు చేయాలన్నారు.

ఆశ వర్కర్‌పై టీడీపీ కార్యకర్తల దౌర్జన్యం తగదు



కృష్ణవేణిని పరామర్శిస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశ వర్కర్లు

పలాస: పలాస మండలం కిష్టుపురం ఆశ వర్కరు కృష్ణవేణిపై తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు దాడి చేయడం సరికాదని, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణవేణిని మంగళవారం కలిసి పరామర్శించారు. దాడిలో గాయపడిన కృష్ణవేణికి తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వచ్చిన నుంచి స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయాలను ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లినా తగిన విధంగా స్పందిచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఎన్.గణపతి, సబితా పాత్రో, హేమలత, బి.సిమ్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పీజీ సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పీజీ సెట్–2024 రెండో విడత కౌన్సెలింగ్ మంగళవారం ప్రారంభమైంది. మొదటి విడత సీట్ల అలాట్‌మెంట్, సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో మొదటి విడత కౌన్సెలింగ్‌లో 16 పీజీ కోర్సులకు 562 సీట్లు ఉండగా, 259 ప్రవేశాలు జరిగాయి. 303 సీట్లు ఉన్నాయి. 46.08 శాతం ప్రవేశాలు జరిగాయి. రెండో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ మేరకు ఈ నెల 19వ తేదీలోపు రిజిస్ట్రేషన్, 21లోను ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రాల అప్‌లోడ్, 23 నుంచి 25వరకు వెబ్ ఆప్షన్లు, 26న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఇచ్చారు. 28న అలాట్‌మెంట్‌లు ప్రకటిస్తారు. ఐదో తేదీ నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభం కానుంది. సీట్లు లభించిన విద్యార్థులు సైతం కళాశాలలు, సబ్జెక్టులు మార్పు చేసుకోవచ్చు. గతంలో మొదటి కౌన్సెలింగ్‌కు ర్యాంకు వచ్చి హాజరు కాని విద్యార్థులు హాజరు కావచ్చు.

కొత్త మెడికల్ కాలేజీల రద్దు దారుణం



ప్రభుత్వం కొత్త మెడికల్ కాలేజీలను రద్దు చేయాలని లేఖ రాయడం దారుణం. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి నిర్వాకంతో ఈ ఏడాది 50 ఎంబీబీఎస్ సీట్లు పోయాయి. పులివెందుల మెడికల్ కాలేజీని నిర్వహించలేమని గుట్టుచప్పుడు కాకుండా లేఖ రాయడం దుర్మార్గం. వైద్యం, విద్యను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టాలని చూస్తున్నారు. ప్రభుత్వ వైఖరి వల్ల లక్షలు పోసి లాంగ్‌టెర్మ్ కోచింగ్ తీసుకున్న పిల్లల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది.

– జి.సింహాచలం, సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు



కష్టపడినా.. నిరాశ ఎదురైంది



నీట్‌లో మంచి స్కోర్ చేసి ప్రభుత్వ కోటాలో సీట్ సంపాదించాలని ఎంతో కష్టపడ్డాం. లాంగ్‌టెర్మ్ కోచింగ్ తీసుకున్నాం. 543 స్కోర్ చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో వైద్య విద్య సీట్లు తగ్గిపోవటంతో నిరాశ ఎదురైంది. 2023లో మా అక్క 530 స్కోర్ చేస్తే ప్రభుత్వ సీట్ వచ్చింది. చాలామంది మేనేజ్‌మెంట్ సీట్‌కు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు.

– సీహెచ్ సృజన, ప్రకాశరావుపేట, పోలాకి మండలం

నడి బజారులో ధరల మంట

- నింగినంటుతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలు
- అమాంతంగా పెరిగిన నూనె ధరలు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న కొందరు వ్యాపారులు
- పట్టించుకోని మార్కెటింగ్, పౌరసరఫరాల అధికారులు



వంద నోటు పట్టుకుని వెళ్లే సామాన్యుడిని చూసి బజారు నవ్వుతోంది. ఏం కొనేద్దామని ఆ నోటు తెచ్చావంటూ వెక్కిరిస్తోంది. అవును మరి.. నడి బజారులో ధరల మంట రాజుకుంది. ఓ మధ్య తరగతి జీవి సగం జీతాన్ని మింగేసేలా, ఓ నిరుపేద కుటుంబం ఒక్క పూట కూరకే పరిమితమయ్యేలా, సగటు జీతగాడి సంచి సగం మాత్రమే నిండేలా నిత్యావసరాల ధరలు ఆకాశ మార్గం పట్టాయి. దీనికి తోడు కొందరు వ్యాపారుల కృత్రిమ కొరత అనే వికృత చేష్టలు బజారుకు వెళ్లడానికే భయం పుట్టేలా చేస్తున్నాయి.

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

మార్కెట్‌లో ధరలు మండిపోతున్నాయి. వైఎస్సార్ సీపీ హయాంలో ధరలు పెరిగిపోయాయంటూ గగ్గోలు పెట్టిన కూటమి పార్టీ నేతల పాలనలో ఆ ధరలు దాదాపు రెట్టింపయ్యాయి. ధరలు నియంత్రించాల్సిన మార్కెటింగ్, పౌర సరఫరాల అధికారులు చోద్యం చూస్తుండడంతో బహిరంగ మార్కెట్లలో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి మరీ అధిక ధరలకు అమ్మేసుకుంటున్నారు. దేశ చరిత్రలో ఎన్నడు లేనంతగా బంగాళాదుంపల ధరలు ఏకంగా రూ.50కి పైగా పెంచేశారు. అలాగే ఉల్లిపాయలు ధరలు గత నాలుగైదు నెలలుగా రూ.40కి పైగానే పలుకుతున్నాయి. వంద లోపు ఉన్న నూనె అమాంతంగా రూ.130కి పైగా పెరిగిపోయింది. కందిపప్పు కూడా రానురాను పేదోడికి అందకుండాపోతోంది.

ఈ ధరలు సామాన్యులకే కాదు హోటళ్ల నిర్వాహకులను కూడా బెదరగొడుతున్నాయి. అలాగే ప్రభుత్వం సంక్షేమ హాస్టల్స్, కస్తూర్బా స్కూల్, రెసిడెన్షియల్ స్కూల్స్, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏం చేయాలో తెలీక నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. అప్పటి ధరలకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచింది. కానీ ఇప్పుడు ధరలు మరింతగా పెరిగాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని కోరుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీల ప్రకారం నిరుపేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంతో హాయిగా ఉండేది. కానీ కొత్త ప్రభుత్వం మాటలు తప్ప ఇప్పటివరకు చేతలు చూపించలేకపోవడంతో సామాన్యుడికి కష్టాలు తప్పడం లేదు.



అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

కూరగాయలు అధిక ధరలకు అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటాం. రైతు బజార్లలో రైతులు పండించే కూరగాయలు తక్కువ ధరలకే అమ్మేలా చూస్తున్నాం. ఎక్కడైనా అధిక ధరలకు అమ్మకాలు చేసినట్లు మా దృష్టికి తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. – నాగలక్ష్మి, సహాయ సంచాలకులు, మార్కెటింగ్ శాఖ, శ్రీకాకుళం

నిత్యావసరాల ధరల్లో పెరుగుదల ఇలా..

వస్తువులు	జనవరిలో కిలో ధర(రూ.ల్లో)	సెప్టెంబర్ 2024
పసుపు	180	240
కారం	80	340
కందిపప్పు	150	180
పెసరపప్పు	100	130
బఠాణీ	60	80
శనగపప్పు	80	110
పోపులు	100	140
శనగపలుకులు	110	150
బియ్యం (26)	1500	1700
నూనె (లీటరు)	90	130

కూర'గాయాలు' ఇలా..

కూరగాయలు	జనవరిలో కిలోధర(రూ.ల్లో)	సెప్టెంబర్–2024
టమాట	20	50
బంగాళాదుంపలు	20	50
ఉల్లిపాయలు	25	55
వంకాయలు	25	45
బెండకాయలు	20	40
దొండకాయలు	18	35
బీరకాయలు	20	40
పచ్చిమిర్చి	50	80
అల్లం	60	100
వెల్లుల్లి	240	320

గంజి మెతుకులే దిక్కు..



ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో గంజి మెతుకులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. వచ్చే అరకొర పెన్షన్ మా ఆయన మందులకు, నిత్యావసర సరుకులకు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో అయితే మాకు వచ్చిన పెన్షన్ చక్కగా సరిపోయేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రతి నెలా అప్పులు చేసి కాలం గడపాల్సి వస్తోంది.

– డి.రవణమ్మ, టి–ఏజెంట్ కాలనీ, శ్రీకాకుళం నగరం

కాయగూర భోజనం కష్టమైపోతోంది



గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అన్నీ వచ్చేవి. ధరలు కూడా ఇప్పుడున్నంత ఎక్కువగా లేవు. ఇప్పుడు అలా కాదు. ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వం ఒక్క హామీని కూడా ఇప్పటివరకు నిలబెట్టుకోలేదు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు కాయగూర భోజనం కష్టమైపోతోంది.

– చింతల సత్యవతి, ఉుకలాం, నరసన్నపేట మండలం



నేస్తాలూ బాగున్నారా..

నేస్తాలూ బాగున్నారా..
ఎంత కాలమైపోయిందో ఈ గాలి తగిలి..
ఇదిగో ఇప్పుడిప్పుడే మావాళ్లంతా తేలుకుంచిలో దిగుతున్నారు..
సైబీరియా నుంచి రావాలి కదా..
అన్నట్టు పరిచయం చేసుకోవడం మర్చిపోయాం కదూ..
మేమండీ ఓపెన్ బిల్ స్టార్క్స్..
అదేనండీ మీరు ముద్దుగా పిలుచుకునే నత్తగొట్టు, చిల్లుముక్కు కొంగలం..
మా దవడల మధ్య బాహుదా నది అంత ఖాళీ ఉంటుందని మీరు ముద్దుగా ఇలా పిలుస్తారని మాకు తెలుసులెండి..
అయినా మీరెలా పిలిచినా మాకు బాగానే ఉంటుంది..
మీరంటే అంత ప్రేమ మాకు..
అంత దూరం నుంచి ఎగురుకుంటూ అలసిపోయి వస్తే..
మీ ఊరిలోని చెట్లపై మాకు గూడు ఇస్తారు..
మావాళ్లలో ఎవరికైనా బాగోకపోతే..
దగ్గరుండి వైద్యం చేయిస్తారు..
మీ పొలాల్లోనే మాకు మూడు పూటలా కడుపు నింపుతారు..
ఇంటికొచ్చిన ఆడపిల్లను చూసుకున్నట్టు ఆరు నెలల పాటు ఆదరిస్తారు..
ఏదేమైనా ఉద్దానం జనాలు చూపించే ఆప్యాయత ముందు ఏదీ సాటి రాదులెండి..




తేలుకుంచిలో సందడి చేస్తున్న సైబీరియా పక్షులు

మేము వస్తేనే తొలకరి వస్తుందని మీరు నమ్ముతారు..
మీ కోసమైనా మేం కాసిన్ని మబ్బులను వెంట తీసుకుని వస్తుంటాం..
మా తాతముత్తాతల నుంచి మనం మనం బరంపురం కాబట్టి..
మా మనవళ్లు, మనవరాళ్ల తరం కూడా సంతానం కోసం మీ దగ్గరకే రావాలి కాబట్టి..
మీకు కొన్ని సంగతులు చెప్పాలండీ..
ఒకప్పుడు.. అంటే ఇప్పటి ముందు తరం వారు మమ్మల్ని చాలా ఆదరంగా చూసుకునేవారు..
మీరు కూడా చూసుకుంటున్నారు.. కానీ ఈ మధ్యనే ఎందుకో మాపై కాసింత ప్రేమ తగ్గినట్టు అనిపిస్తోంది..
ఎప్పుడూ ఈ చెట్లపై మేము వచ్చే నాటికి కాసిన్ని గూళ్లు ఉండేవి..
ఇప్పుడెందుకో అవి కనిపించడం లేదు..
ఇక్కడి తుఫాన్లను మీరూ మేము కలిసే తట్టుకున్నాం..
మీకు సాయం అందిందో లేదో గానీ మాకు మాత్రం అందలేదండీ..
నిజానికి మా కోసమే ఓ ఆస్పత్రి కట్టారు.. సంతోషం..
కానీ దాన్ని తెరవడమే మర్చిపోయినట్టున్నారు..
మేం తిరుగుతున్నామనే.. ఈ ఊరిని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని చెప్పారు..
ఆ మాటలు విని మేమెంత సంతోషపడ్డామో..
కానీ అదేంటో మరి.. ఆ మాటలేవీ నిజం కాలేదు..
మేమెంత సైబీరియా వాళ్లమైనా ఉద్దానం కూడా మా ఊరే..
ఆ ప్రేమతోనే ఈ సంగతులు మీతో పంచుకుంటున్నాం..
ఎన్ని సమస్యలు ఉన్నా..
మా జాతి వృద్ధికి కారణమైన ఈ గడ్డ ఎప్పుడూ బాగుండాలనేదే మా తపన..
ఉంటామండీ మరి..

ఇట్లు,
మీ విదేశీ నేస్తాలం
– ఇచ్ఛాపురం రూరల్

ఆపద వస్తే దిక్కెవరు..?



- జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎమర్జెన్సీ వైద్యం కూడా బంద్
- గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో రోగులకు తప్పని పాట్లు
- జీఓ 85 రద్దు కోసం విజయవాడలో నిరసనకు దిగిన పీహెచ్‌సీ వైద్యులు
- బయోమెట్రిక్‌కు దూరంగా పీహెచ్‌సీ డాక్టర్లు

అరసవల్లి:

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎమర్జెన్సీ సేవలు కూడా ఆగిపోయాయి. గ్రామీణ, ఏజెన్సీలో పీహెచ్‌సీ వైద్యులకు ఇన్‌సర్వీస్‌తో పీజీ సీట్ల కేటాయింపు కోటాను కుదించేలా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 85ను తక్షణమే రద్దు చేయాలన్న ఏకైక డిమాండ్‌తో ఏపీప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని పీహెచ్‌సీల్లో సాధారణ సేవలతో పాటు అత్యవసర వైద్య సేవలు కూడా మంగళవారం నుంచి ఆగిపోయాయి. దీంతో జిల్లాలో వందలాది మంది గ్రామీణ రోగులు అత్యవసర వైద్యం అందక తీవ్ర అవస్థలు పడ్డారు. కొందరైతే వ్యయప్రయాసలకు లోనై ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెట్టారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధి బాధితులు వేలల్లో ఉన్న నేపథ్యంలో ఇబ్బందులు తీవ్రమయ్యాయి.

వైద్యులంతా విజయవాడకే

జిల్లాలో మొత్తం 71 పీహెచ్‌సీల్లో మొత్తం సుమారు 124 మంది గ్రామీణ వైద్యులు విజయవాడకు చేరుకున్నారు. మంగళవారం ఒక్క వైద్యుడు కూడా బయోమెట్రిక్ హాజరు వెయ్యకపోగా ఎమర్జెన్సీ వైద్యానికి కూడా దూరంగా ఉన్నారు. అలాగే రాష్ట్ర, జిల్లా అధికారుల టెలీ, వీడియా కాన్ఫరెన్స్‌లను కూడా బాయ్‌కాట్ చేశారు. జీఓ నంబర్ 85కు వ్యతిరేకంగా ఈనెల 10 నుంచే దశలవారీగా నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. తాజాగా మంగళవారం విజయవాడ ధర్నా చౌక్‌లో జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఎం.సందీప్, రమేష్‌నాయుడుల ఆధ్వర్యంలో జిల్లా నుంచి వైద్యులు నిరసన కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. జ్వరాలు, డెంగీ అనుమానితులు, తీవ్ర రోగాలకు గురైన అత్యవసర కేసుల వైద్యానికి కూడా అవకాశం లేకపోవడంతో జిల్లాలో వందలాది మంది ఇబ్బందులు పడ్డారు.

డిమాండ్ తీర్చాల్సిందే



ప్రభుత్వం ఇప్పటికైనా పీజీ సీట్ల కుదింపు జీఓ 85ను రద్దు చేయాల్సిందే. ఈ ఏకైక డిమాండ్ కోసం విజయవాడలో నిరసన చేపట్టాం. పీజీ సీట్ల కోటాను తగ్గించడంతో ప్రభుత్వం వైద్య రంగంపై నిర్లక్ష్యంగా ఉందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే అన్ని జిల్లాల్లో పీహెచ్‌సీల్లో ఎమర్జెన్సీ వైద్యసేవలను కూడా నిలిపివేస్తూ నిరసన తెలియజేస్తున్నాం.

– డాక్టర్ సందీప్, జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘ అధ్యక్షుడు



విజయవాడలో నిరసనలో పాల్గొన్న జిల్లాకు చెందిన పీహెచ్‌సీ వైద్యుల బృందం

విశ్వకర్మకు ఘనంగా పూజలు



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

విశ్వకర్మ పూజ హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రధానమైనదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. విశ్వకర్మ జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పండుగగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన సందర్భంగా.. మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఇ.అనురాధ, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, జిల్లా విశ్వ బ్రాహ్మణ జిల్లా వెల్ఫేర్ సంగమ్ అధ్యక్షుడు ధనుంజయ ఆచారి, గణపతి, వీరాస్వామి, హరినాథ్ తదితర కమ్యూనిటీ సభ్యులు, కలెక్టరేట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. –శ్రీకాకుళం పాతబస్టాండ్

నులిపురుగుల మాత్రలు తప్పనిసరి



రెండు నుంచి పంతొమ్మిదేళ్ల పిల్లలంతా తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలను నమిలి మింగాలని కలెక్టర్ స్వప్ని ల్ దినకర్ సూచించారు. డీవార్మింగ్ డేను పురస్కరించుకుని నగరంలోని పీఎస్‌ఎన్‌ఎం ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జాతీయ డీవార్మింగ్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పిల్లలకు స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మాత్ర లతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవని తెలియజేశారు. పాఠశాలకు హాజరుకానివారికి కూడా ఎలాగైనా ఈ మాత్రలు వేయించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 4.70 లక్షల మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసేందుకు వైద్యశాఖ ఆధ్వర్యంలో అన్ని చర్యలు చేపట్టడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, డీఈఓ. తిరుమల చైతన్య, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు. –శ్రీకాకుళం న్యూకాలనీ

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ఆంధ్రకేసరి వర్సిటీ వీసీ మూర్తి


వీసీ మూర్తికి జ్ఞాపిక అందజేస్తున్న శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఒంగోలు ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ డి.వి.ఆర్ మూర్తి మంగళ వారం దర్శించుకున్నారు. స్థానిక అంబేడ్కర్ వర్సిటీ జర్నలిజం విభాగాధిపతులు, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో జర్నలి జం ప్రొఫెసర్లు రెడ్డి తిరుపతిరావు, గుంట లీలావరప్రసాద్, వై.డి.రామ్‌దాస్ తదితరులు న్నారు.

రాష్ట్రస్థాయి షాట్‌ఫుట్ పోటీలకు తామరాపల్లి విద్యార్థిని


భవానీని అభినందిస్తున్న హెచ్‌ఎం

నరసన్నపేట: కొన్న చిన్నారావు అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా డిస్కస్ త్రో విభాగంలో రాణించిన తామరాపల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని కోల భవానీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు హెచ్‌ఎం వెం కటరావు, పీడీ గణపతిరావు, ఉపాధ్యాయులు విద్యార్థిని మంగళవారం అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షిం చారు.

నేడు లేబర్ కమిషన్ విచారణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఈ ఏడాది జనవరి 1న అప్పటి వీసీ నిమ్మ వెంకటరావు టెర్మ్‌లో నియమిం చారు. 8 నెలలు గడిచినా వీరికి ఇప్పటి వరకు వేతనాలు అందజేయలేదు. నిబంధనలు మేరకు పనిచేయించుకున్న 100 రోజుల్లోగా వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో కొం దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు లేబర్ కమిషన్ కార్యాలయంలో ఈ నెల 4న ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ సంస్థలో తొమ్మిది నెలలుగా తమకు వేతనం ఇవ్వడం లేదని, వెంటనే న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, వర్సిటీ అధికారులు శ్రీకాకుళం పట్టణంలోని లేబర్ కమిషన్ కార్యాలయంలో హాజరై వాదన వినిపించాలని అసిస్టెంట్ కమి షనర్ ఆఫ్ లేబర్ నోటీసులు జారీ చేశారు. ఈ విచారణ బుధవారం జరగనుంది. అధికారులు హాజరుకాకపోతే అపరాధ రుసుం అం దజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రూ.లక్షా 80 వేలు పలికిన గణపతి లడ్డూ


లడ్డూతో సంఘ సభ్యులు

కాశీబుగ్గ: పలాస కన్యకాపరమేశ్వరి ఆలయం లో మంగళవారం వినాయక లడ్డూ వేలం జరి గింది. పలాస వైశ్యసంఘం సభ్యులు 20 మం ది ఏకమై రూ.లక్షా 80 వేలకు లడ్డూను దక్కిం చుకున్నారు. అనంతరం లడ్డూను ఊరేగించారు.

లబ్ధిదారులకు గృహపత్రాల పంపిణీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ మంగళవారం ఒడిశాలో ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించిన 20 మంది లబ్ధిదారులకు గృ హాల తాళాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుం డ్కర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వ రరావుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. కలె క్టర్ కార్యాలయ సమావేశ మందిరం వద్ద జరి గిన ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ నగేష్, డీఈ, ఏఈలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బీహార్ యువకుడు మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: బీహార్ రాష్ట్రం ముజఫర్‌పూర్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు అనారో గ్యంతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన అన్నదమ్ములు రజినీస్‌కుమార్ (19), జితేంద్ర భగత్‌లు అరిణాంఅక్కివలసలోని నాగార్జునా అగ్రికెం పరిశ్రమలో నాలుగేళ్లుగా పెయింట ర్లుగా పనిచేస్తున్నారు. పది రోజులుగా రజినీ స్కుమార్ జ్వరంతో బాధపడుతూ చిలకపా లెంలోని తన అద్దె ఇంటిలో విశ్రాంతి తీసుకుం టున్నాడు. మంగళవారం ఒక్కసారిగా ఆరోగ్యం క్షీణించటంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బీహార్‌కు మృతదేహం తీసుకు వెళ్లే ప్రయత్నం చేయటంతో వైద్యులు పోస్టుమార్టం తప్పనిసరని చెప్పారు. దీంతో మృతుడి అన్నయ్య జితేంద్రభగత్ ఎచ్చెర్ల పోలీస్ స్టేష న్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి నట్లు ఎస్సై వి.సందీప్‌కుమార్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం బీహార్‌కు మృ తదేహం తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

- కాసులు కురిపిస్తున్న జంబాడ కొండ
- మూడు రోజులుగా కంకర, రాళ్లు అక్రమ రవాణా
- కడగండి రిజర్వాయర్‌కు పొంచి ఉన్న ముప్పు
- స్పందించని రెవెన్యూ యంత్రాంగం

కొండను కొల్లగొట్టారు

జేసీబీతో కొండను తవ్వుతున్న దృశ్యం



చర్యలు తప్పవు..

అనుమతి లేకుండా కొండ నుంచి కంకర, రాళ్లు తరలించటం నేరం. ఎవరైనా ఇలా చేస్తే వారిపై చర్యలు తప్పవు. తక్షణమే అక్కడి రెవెన్యూ అధికారులతో మాట్లాడివారిపై చర్యలు తీసుకుం టాను.ఎన్నో తరా లుగా వస్తున్న కొండలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది.

– సుదర్శన దొర, ఆర్డీఓ, టెక్కలి, శ్రీకాకుళం

ఎల్.ఎన్.పేట:

కూటమి ప్రభుత్వం వచ్చాక కొండలకు కూడా రక్షణ లేకుండాపోతోంది. అధికారం అడ్డం పెట్టుకుని కొందరు అక్రమార్కులు పట్టపగలే కొం డలు కొల్లకొట్టుకుపోతున్నారు. మూడు రోజులుగా ట్రాక్టర్ల ద్వారా కంకర, కొండ రాళ్లు తరలించుకు పోతున్నా అడిగే నాథుడే లేడు. ఎల్.ఎన్.పేట మం డలం బొర్రంపేట ఎగువున ఉన్న జంబాడ కొండ నుంచి అలికాం-బత్తిలి (ఏబీ) ప్రధాన రహదారి మీదుగా కంకర అక్రమ రవాణా జరుగుతోంది. జేసీబీ యంత్రాల సాయంతో తవ్వకాలు జరిపి ట్రాక్టర్ల ద్వారా కంకర, కొండ రాళ్లు తరలించుకు పోతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదం తా అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే జరుగు తోందని, కొంతమంది రెవెన్యూ అధికారులకు ముడుపులు అందడం వల్లే ఎవరూ పట్టించుకోవ టం లేదని స్థానికులు బాహాటంగా విమర్శి స్తున్నారు.

రిజర్వాయర్‌కు ముప్పు..

వర్షాకాలంలో కొండల్లో కురిసిన వర్షం నీటిని నిలిపి పంట పొలాలకు తరలించేందుకు కడగండి గెడ్డపై రిజర్వాయర్ నిర్మించారు. రిజర్వాయర్ గట్టుకు పశ్చిమాన బంగ్లా మెట్ట, తూర్పున నందిగాడి మెట్ట ఉన్నాయి. ఈ రెండు కొండల మధ్య గట్టు నిర్మించి జలాశయాన్ని ఏర్పాటు చేశారు. తూర్పున ఉన్న నందిగాడి మెట్ట నుంచి కంకర, పునాది రాళ్లు తర లించుకుపోతున్నారు. కొన్ని రోజులకు ఈ నం దిగాడి మెట్ట కనుమరుగైతే రూ.కోట్లు ఖర్చుతో నిర్మించిన జలాశయానికి ముప్పు తప్పదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.

మాకు సంబంధం లేదు: తహశీల్దారు

రెవెన్యూ పరిధిలో ఉన్న కండను కొల్లగొట్టుకుపోతు న్నారని మీడియా ప్రతినిధులు ఎల్.ఎన్.పేట తహ శీల్దారు వై.వి.పద్మావతికి ఫోన్ ద్వారా తెలియజే శారు. దీనిపై ఆమె స్పందిస్తూ 'కొండతో తమకు సంబంధం లేదని, రెవెన్యూ కొండ అయినప్పటికీ మైన్స్ (గనులు, భూగర్భ శాఖ) అధికారులకు చెప్పాలని, ఈ విషయంలో మేమేం చేయగలం' అని సమాధానం ఇచ్చారు.

మాట్లాడి వదిలేశారు..

కొండ నుంచి కంకర తరలించుకుపోతున్న సమాచా రం తెలుసుకున్న టెక్కలి ఆర్డీఓ సుదర్శన దొర వెం టనే అక్కడికి రెవెన్యూ ఉద్యోగులను పంపించారు. రెవెన్యూ అధికారులు వెళ్లినప్పటికే జేసీబీ, కొన్ని ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మాట్లాడి వదిలేయడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయంలోకి చోరులు!


సచివాలయం బయట విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది

గార: మండలంలోని కళింగపట్నం సచివాలయం లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. మంగళ వారం సచివాలయం వద్దకు వచ్చేసరికి ప్రధాన ద్వారం తలుపు గడియ విరగ్గొట్టి, రెండు అల్మారాల్లోని రికార్డులు చిందరవందరగా పడి ఉం డటం, బీరువా తెరిచి ఉండటం గమనించిన కార్యదర్శి బి.కిషోర్‌కుమార్ జిల్లా పంచాయతీ అధి కారి, మండల అభివృద్ధి అధికారి, తహశీల్దార్, గార పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముఖ్యమైన రికా ర్డులుండే సెక్రటరీ బీరువాను వేరే తాళంతో బలవం తంగా తెరచి ఉండటంపై పలు అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. ఈ విషయమై కార్యదర్శి మాట్లాడుతూ రికార్డులన్నీ క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉందని, అధికారుల ఆదేశాల మేరకు తదుపరి పనులు చేస్తామన్నారు. కాగా, మంగళవారం ఉదయం సిబ్బంది స్వచ్ఛత హి ర్యాలీ అనంతరం సచివాలయంలోకి వెళ్లకుండా బయటే కుర్చీలు వేసుకొని విధులు నిర్వర్తించారు.

నందివాడ ఆశ్రమంలో చోరీ


వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్‌టీం

పొందూరు:

మండలంలోని నందివాడ బాలయోగి ఆశ్రమంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. భక్తులు సమర్పించిన దక్షిణలు, మొక్కుబడులు దొంగల పాలయ్యాయి. సుమారు రూ.8 కేజీల వెండి ఆభరణాలు, రెండు తులాలకు పైగా బం గారు ఆభరణాలు మాయమయ్యాయి. మొత్తం రూ. 8 లక్షలు విలువ చేసే వెండి, బంగారు ఆభ రణాలతో పాటు హుండీలో లక్షల రూపాయలు చోరీకి గురయ్యాయని బాలయోగి ఆశ్రమ కమిటీ సభ్యులు పొందూరు పోలీసు స్టేషన్‌లో మంగ ళవారం ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్సై వి.స త్యనారాయణ సిబ్బందితో వెళ్లి దర్యాప్తు ప్రారం భించారు. పోలీసులతో పాటు క్లూస్‌టీం సైతం ఆశ్రమానికి చేరుకుని వివరాలు సేకరించారు.

శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి

ఆమదాలవలస: వ్యవసాయరంగంలో శాస్త్రీయ పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడులు సాధించ వచ్చని కృషివిజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. ఆమదాలవలస కేవీ కేలో మంగళవారం ఆత్మ సౌజన్యంతో శాస్త్రీయ పద్ధతులపై రైతులకు ఒక్కరోజు శిక్షణ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ సంఘటితంగా మారి ఉత్పత్తులను అమ్మగలిగితే అధిక నికర ఆదాయాలను పొంద వచ్చని వివరించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిర ణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ కషాయాలు, జీవామృతాల తయారీని వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ కె.అనూష మాట్లాడుతూ చీడపీడల యాజమాన్యంపై అవగా హన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ నీలవేణి, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ హరికుమార్, ఆమదాలవలస మండల వ్యవసాయాధికారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ థియేటర్ సిబ్బందికి గాయాలు

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ఆపరే షన్ థియేటర్‌లో మంగళవారం జరిగిన ప్రమాదంలో సిబ్బందికి స్వల్ప గాయాల య్యాయి. మంగళవారం డెలివరీ కేసుకు సం బంధించి ఆపరేషన్ థియేటర్‌ను సిద్ధం చేస్తుం డగా అడ్జెస్టబుల్ లైట్ ఒక్కసారిగా పక్కకు తూలిపోయింది. దీంతో అక్కడే ఉన్న థియేటర్ అసిస్టెంట్ గోవింద్, వైద్యురాలు ధనలక్ష్మి, స్టాఫ్ నర్సు వరలక్ష్మికి గాయాలయ్యాయి.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్సీ


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్ స్వప్నిల్ దిన కర్ పుండ్కర్‌ని ఎమ్మెల్సీ నర్తు రామారావు మం గళవారం మర్యాదపూరకంగా కలిశారు. ఇచ్ఛా పురంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిం చాలని వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురి సిన వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, బెంతొరియాల సమస్య పరిష్క రించాలని, రోడ్లు బాగు చేయాలని, ఇసుక కొరత నివారించాలని విన్నవించారు.

'డీసీసీ అధ్యక్ష పదవికి అంబటి అనర్హుడు'

శ్రీకాకుళం అర్బన్: డీసీసీ అధ్యక్షునిగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న అంబటి కృష్ణారావు ఆ పదవికి అనర్హుడని, ఆయన్ని వెంటనే పదవి నుంచి తప్పించాలని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మం గళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రోజుకో మాట మాట్లాడుతూ తొలి మీడియా సమావేశంలోనే అభాసుపాలైన అంబటి మాన సిక ఆరోగ్యం సరిగా లేదని తాము భావిస్తు న్నామని పేర్కొన్నారు. ఆయన వ్యవహారం జాతీయ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల్ని ఇరికించే దిగా ఉందని, గత ఎన్నికల్లో టికెట్లు అమ్ముకు న్నారంటూ మీడియా సమావేశంలో అంబటి చేసిన ఆరోపణపై తీవ్ర అభ్యంతరం చెబుతు న్నామన్నారు. శాసనసభ టికెట్ల కోసం తామెవ రికీ రూపాయి కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ పా ర్టీలో టికెట్లు కొనుక్కునే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో కాం గ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి పేడాడ పర మేశ్వరరావు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చా ర్జిలు సనపల అన్నాజీరావు, మనుపత్రి చక్రవర్తి రెడ్డి, కొప్పురొత్తు వెంకటరావు, మంత్రి నరసిం హమూర్తి, కరిమజ్జి మల్లేశ్వరరావు ఉన్నారు.

బాలుడి వైద్యానికి సాయం


లిఖిత్‌కు సాయం అందిస్తున్న పేడాడ శ్రీరామమూర్తి

జి.సిగడాం: మండలంలోని ఉల్లివలస (నాయుడు వలస) గ్రామానికి చెందిన కాకర్లపూడి రామకృష్ణం రాజు, శైలజ కుమారుడు లిఖిత్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో 'ఆ గుండెకు అండకావాలి' అనే శీర్షికను ఈనెల 14న 'సాక్షి'లో కథనం ప్రచురి తమైంది. దీనిపై స్పందించిన వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు, దవళపేట గ్రామానికి చెందిన పేడాడ శ్రీరామమూర్తి మంగళవారం గ్రామానికి వెళ్లి కొంత ఆర్థిక సాయం అందించారు. బాతువ ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు మొయ్యి జనార్దనరావు కూడా సాయం అందించారని బాలుడి తల్లిదండ్రులు తెలిపారు. కార్యక్రమంలో పేడాడ నారాయణరావు, కంచరాన రమణారావు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు అందరి సహకారం అవసరం


పరిసరాలను శుభ్రం చేస్తున్న కేంద్రమంత్రి, అధికారులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): భారతదేశాన్ని స్వచ్ఛత వైపు నడిపించాలని, అందుకు శ్రీకాకుళం నుంచే శ్రీకారం చుట్టాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మం గళవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకా కుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతోనే స్వచ్ఛభారత్ సాకారమవుతుందన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు, డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, జిల్లా సమా చార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంతో ప్రభుత్వ చెలగాటం


బాలికోన్నత పాఠశాలలో పాడైపోయిన గుడ్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సోంపేట: సోంపేట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో కుళ్లిపోయిన కోడిగుడ్లను మంగళవారం విద్యార్థులకు వడ్డిం చారు. విద్యార్థులు ఈ గుడ్లను చూసి తల్లిదండ్రు లకు విషయం చెప్పారు. విషయం ఎంపీడీఓ బెం దాళం వెంకటరమణ వరకు వెళ్లడంతో ఆయన పాఠ శాలకు వచ్చి పరిశీలించారు. పాడైపోయిన గుడ్లు విద్యార్థులకు ఎందుకు అందజేస్తున్నారని ప్రధానో పాధ్యాయులు, వంట నిర్వాహకులను ప్రశ్నించారు. గుడ్లు అందజేస్తున్న వ్యక్తి ఇలాంటి గుడ్లనే పాఠ శాలకు సరఫరా చేస్తున్నారని వారు తెలియజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ఎంపీడీఓ తెలియజేశారు. విద్యార్థులకు ఇలాంటి గుడ్లు అంద జేయడం దారుణమని అన్నారు. ఇకపై ఇలాంటి పొరపాట్లు జరిగితే చర్యలు తీసుకుంటామని, గుడ్లు సరఫరా చేసే వ్యక్తిపైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ

రణస్థలం: రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు అన్నదాతకు పెట్టుబడి సాయం కింద వెంటనే రూ. 20వేలు జమ చేయాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రణస్థలం తహసీల్దార్ ప్రసాద్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రస్తుతం పంటలకు అవసరమైన యూరియాను కొందామన్నా దొరకడం లేదని, వేరే ఎరువులు, పురుగు మందులు కొంటేనే యూరియా ఇస్తామని వాటిని అంటగడుతున్నారని తెలిపారు. సన్న, చిన్నకారు రైతులు, ప్రత్యేకించి కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని, పంటలకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కరువు, వరదలు కారణంగా నష్టపోయిన పంటలకు బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. తోటపల్లి కాలువలో పూడికలు తొలగించి రైతాం గాన్ని ఆదుకోవాలని కోరారు. జిల్లాలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు ఐ.రమణ, ఎస్.శ్రీరామ్, గొర్లె రమణ తదిత రులు పాల్గొన్నారు.

జనం నుంచి జలంలోకి..



రణస్థలం: వినాయక నవరాత్రి ఉత్సవాలు పూర్త యిన నేపథ్యంలో గణనాథులు గంగమ్మ ఒడిలోనికి చేరుకుంటున్నారు. రణస్థలం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జె.ఆర్.పురంలో 12 అడు గుల భారీ గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

శ్రీకాకుళం క్రైమ్ : విద్యార్థి దశలో బంగారు భవితకు చదువుతో పాటు క్రీడలు కూడా ఉపకరిస్తాయని.. అటువంటి క్రీడల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాణించాలని ఎస్పీ కె.వి.మహేశ్వ రరెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల అన్నవరంలో జరిగిన రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ చాంయన్‌షి ప్‌లో గెలుపొందిన జిల్లా క్రీడాకారులు బెందు జ్యోత్స్న, ఎస్.ప్రవీణ్, జి.ఛాయాకిరణ్‌లను మంగళ వారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అభినం దించారు. కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఫిజికల్ డైరెక్టర్ మధు, సంఘ ప్రతినిధులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో స్టాఫ్ ర్యాటిఫికేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం లో మంగళవారం 13 బీఎడ్ కళాశాలలు, మూడు బీపీఈడీ కళాశాలలు, ఒక డీపీఈడీ కళాశాలకు సంబంధించి స్టాఫ్ ర్యాటిఫికేషన్ నిర్వహించారు. వర్సిటీ పాలక మండల సమా వేశ మందిరంలో మంగళవారం ఆంధ్రా విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ విజయ్‌మోహన్, విద్యావి భాగం అసోసియేట్ ప్రొఫెసర్లు శారన్‌రాజు, నాగరాజకుమారి ఈ ప్రక్రియ చేపట్టారు. జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి, ఉన్నత విద్యా మండలి నిబంధనల మేరకు 50 మంది విద్యా ర్థులు ఉంటే ప్రిన్సిపాల్, ఏడుగురు అధ్యాపకులు.. 100 మం ది విద్యార్థులు ఉంటే ప్రిన్సిపాల్, 14 మంది అధ్యాపకులు ఉండాలి. కళాశాలలు వారీగా అధ్యాపకుల విద్యార్హత ధ్రువీక రణ పత్రాలు పరిశీలించారు. అనంతరం విషయ పరిజ్ఞా నాన్ని వైవా వాయిస్ ద్వారా తెలుసుకున్నారు. అర్హత ఆధారం గా నివేదిక వర్సిటీ అధికారులకు అందజేశారు. కొంద మంది అధ్యాపకులకు రిమార్కులు సైతం రాశారు. కళాశాలలు నివే దిక ఆధారంగా భవిష్యత్తులో అర్హత గల స్టాఫ్‌ను నియమిం చుకోవాల్సి ఉంటుంది.

● శ్రీచక్ర వెలుగులు

జిల్లా కేంద్రంలోని బలగ నాగావళి తీరంలో బాల త్రిపుర కాలభైరవపీఠం దేవా లయం వద్ద మంగళవారం పౌర్ణమి సందర్భంగా శ్రీచక్ర రూపేన (మేరువు రూపంలో) సిరిజ్యోతి పూజలు భక్తిశ్రద్ధ లతో నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రంపై దీపాలు వెలిగించి పూజలు చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్

